**కథ**

పశ్చిమగోదావరి జిల్లా పాడి పంటలకి పల్లెపట్టులకు పెట్టింది పేరు. ఏడాది పొడవునా ప్రవహించే కాలవనీళ్ళు రైతాంగానికి ఊపిరి. అన్నీ నల్లరేగడి భూములు. నాలుగు చెక్కల మడి వున్నా దున్నుకొని బతగ్గల ధీమా వాళ్ళది. కాలవ పక్క పొలాలున్న రైతులంతా ధనికుల కిందే లెక్క.

ఏటి పక్క ఒక దిశంతా పచ్చని పొలాలు మరొక ప్రక్కంతా లంక గరావులు..

పొలంగట్లు దాటి అడుగులు వేస్తున్న కొద్దీ.. తల తిప్పి ఎటు పక్క చూసినా నర్సరీలు.. రంగు రంగుల పూల తోటలు.. గుబురుగా పెరిగిన మొక్కలు.. అరచేతి మందాన విరబూసిన రంగు రంగుల గులాబీ పూలు..

చేలగట్లు దాటి లంక చేరుతున్న కొద్దీ గులాబీ పరిమళం గాలిలో కలిసి పరిసరాలను ఆహ్లాద పరుస్తుంది.

దాదాపు పదిహేను ఎకరాల్లో ఆ లంకంతా వున్న నర్సరీలన్నీ శ్రీనివాసరెడ్డివి. తూరుపు ఇంకా తెలబార లేదు.

అప్పటికే ఆడ మగ కూలి జనం ఆ నర్సరీలో పన్లు చూసుకుంటున్నారు.

కొబ్బరి, రబ్బరు, టేకు, జామా, మామిడి, జావా, సపోటాతో పాటు ఎన్నోరకాల పూలమొక్కలు కొన్ని వందల సంఖ్యలో చిన్న చిన్న ప్లాస్టిక్ సంచుల్లో ప్రాణం పోసుకుంటున్నాయి. అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయి. ఇవ్వాళో రేపో ఆ మొక్కలన్నీ లారీలకి ఎక్కి పట్నం చేరతాయి. మళ్ళీ నెలరోజులలో అన్ని మొక్కలు ఆ నర్సరీలలో తయారవుతాయి. అక్కడ పని చేస్తున్న కూలీలందరూ బాగా తర్ఫీదు పొందినవాళ్ళు కావడం చేత ఆ పనులన్నీ ఒకటి తరువాత రెండు వచ్చినట్లు క్రమపద్ధతిలో జరిగిపోతాయి.

గులాబీల ప్యాకేజీ కోసం స్టోర్ చేసిన పల్చటి వెదురు బుట్టలను గోడౌన్‌లోంచి బయటికి తీస్తున్నాడు ముంగయ్య.

బోరింగ్ గట్టున వున్న సిమ్మెంటు దిమ్మె మీద కూర్చొని దినపత్రిక చదువుతున్న శ్రీనివాసరెడ్డి చిలక లన్నీ ఒక్కసారి కులుకులు ఒలకపోసినట్లు కిలకిలా ఆడపిల్లల నవ్వులు వినిపించటంతో పేపర్లోంచి తలెత్తి చూశాడు.

లంకలోంచి ఆడపిల్లల గుంపు చేలగట్లమీదుగా నడిచి గులాబీ తోటల వైపుగా వస్తూంది.

అంతా ఎనిమిది నుంచి పదిహేను లోపు వయసు వాళ్ళు. ఆ ఆడపిల్లలను చూడగానే అట్టడుగు వర్గం కూలినాలి చేసుకునే వాళ్ళని చెప్పకనే తెలుస్తూంది. చేతుల్లో సత్తుచద్ది క్యారేజీలు, నూనె లేక అంటకట్టిన చింపిరిజుత్తులు, మెళ్ళో గిల్టు గొలుసులు పూసలపేర్లు, చిరిగి మాసికలు పడిన ముతక పరికిణీలు, ఎవరో పెద్దింటి వాళ్ళు ఇచ్చిన జాకెట్లు లూజు కావడం వల్ల పిన్నీసులు బిగించి పెట్టి కింద ముడిపెట్టారు.

దాంతో పరికిణీకి జాకెట్టుకి నడుమ జానెడు వెడల్పున నల్లగా పొట్ట, కిందుగా నాభి కనిస్తూంది.

ఇదే సినిమాల్లో అయితే 'ఎక్స్‌పోజింగ్' అంటారు అనుకున్నాడు బోరింగ్ గట్టు మీద కూర్చొన్న శ్రీనివాసరెడ్డి, అర్టీ కల్చరిస్ట్. పట్నంలో వ్యవసాయం సంబంధిత చదువు చదివి పల్లెకి వచ్చి సొంత వ్యవసాయం పన్లు తండ్రితో పాటు చూసుకొంటున్నాడు. ఆరేళ్ళుగా నర్సరీలు పెట్టాడు. మూడు పువ్వులు ఆరుకాయలుగా ఉంది వ్యాపారం. ఆదాయానికి కొరత లేదు.

మడిచి లుంగీలా కట్టుకున్న తెల్లటి పాలిస్టరు గ్లాస్కో పంచె, సన్నటి గళ్ళతో ఉన్న ఫుల్ హ్యాండ్స్ బాంబేడయింగ్ షర్ట్, ఒత్తయిన క్రాపు, అందమైన కొరమీసకట్టు, వేళ్ళకి ఉంగరాలు, మెళ్ళో పులిగోరు గొలుసు; బంగారం కరిగించి పోత పోసినట్టు పచ్చని శరీరం...

ఊరంతటికి అందగాడు. చదువుకొన్న వాడు ఆగర్భ శ్రీమంతుడు. కూలికొచ్చిన ఆడంగులు అతన్ని చూసి హీరోని చూసినట్లు తెగసిగ్గులు పడతారు. అందుకే వాళ్ళందరికి 'కొత్త పెళ్ళికూతుళ్ళు' అని పేరు పెట్టాడు. 'నల్ల గులాబీలు' అని కూడా అంటాడు.

గలగల నవ్వుతూ ఆడ పిల్లలు గుంపుగా తోటలోకి రావడంచూసి శ్రీనివాసరెడ్డి చేతిలో పేపరు పక్కన పెడుతూ "ఒరేయ్ సింహాచలం "అని కేకేసి " కొత్త పెళ్ళి కూతుళ్ళ వచ్చేశారు గాని తొందరగా పని మొదలెట్టించు. సూరీడు ఎచ్చబడేప్పటికి పూర్తయి పోవాలి"

# నల్లగులాబి

**–కాకాని కమల**

అన్నాడు.

అప్పటికే గోడౌన్ లోంచి వెదరు బుట్టలు బయటికి తీసి గట్టున పెట్టాడు సింహాచలం.

కన్నె పిల్లల గుంపంతా గలగల లడుతూ తలో ఒక బుట్ట అందుకుని తోటలోకి దిగారు. మడికి ఒక రంగు చొప్పున నాలుగేసి వరుసలుగా గులాబీ మొక్కలు ఒకో పిల్లకి కేటాయించాడు సింహాచలం. రోజూ ఎవరి మడి వరుసల్లో వాళ్ళ గులాబీలు కత్తిరిస్తారు. ఈ రోజూ అలాగే చిన్న కత్తెర్ని బుట్టలు పట్టుకొని ఎవరి మడిలోకి వాళ్ళు దిగి చకచక పూలు కత్తిరించటం మొదలు పెట్టారు.

"ఇంగో పెండ్లికూతుళ్ళూ! ఒక్క రేకు తునిగి కింద పడినా రెడ్డిదొర వూకోడు. కూలి పైసలు ఇరగ్గొడతాడు. ఆ పైన మీ ఇష్టం" అన్నాడు సింహాచలం కఱ్ఱ పట్టు కొని అటు ఇటు తిరిగి అజమాయిషి చేస్తూ.

ఆ మాటకి వెటకారంగా మూతి తిప్పింది నర్సమ్మ "ఆఁ.... మేం పొరాడే సంటి పిల్లలం అందుకుని రేకలన్ని తెంపి పోస్తం." అంది దెప్పుతూ.

"గులాబి రేకులు ఆటంతట అయ్యే రాలిపడ తాయి" అంది బంగారి.

"ఆఁ... అట్లనా? అయితే ఇప్పుడు ఒక్కరేకు చెట్టు కింద రాల్లేదేమే?" అన్నాడు సింహాచలం.

"అవ్వన్ని మంచుకి రేత్తిరంత ఇచ్చుకొని తెల్లారి చెయ్యితాకితే జలజలా రాలుతాయి." అంది చుక్కమ్మ

"మరినే శానా మర్లీ పూలు కోశినా కదే కొత్తపెళ్ళి కూతురా? మరి ఒక్క రేకూ చిదుముకు పోలేదు కదా?" అన్నాడు శ్రీనివాసరెడ్డి కల్పించుకుంటు.

"అది తమరి సెయ్యి మహత్తెం ఏవో...?" అంది ముసి ముసిగ నవ్వుతూ మాలక్ష్మి. దానికి పధ్నాలుగేళ్ళు పెద్దింటి అమ్మాయిగార్ని అడిగి తెచ్చుకొన్న నీలంరంగు వల్లెవాటుని వేసుకుంది. సినిమా బొమ్మలు చూసిముఖం మీది జుత్తు కత్తిరించుకొని రింగు తిప్పింది. శ్రీనివాస రెడ్డి నర్సరీలు పెట్టినప్పట్నుంచి అంటే దాని ఎనిమిదో ఏట నుంచి పనికి వస్తోంది.

కూరగాయలతోటలకి, మల్లెతోటలకి పోయి కూడా తెంపటం చేస్తున్నది. ఏ కాలంలో ఆ పన్లు చెయ్యటమే దాని బతుకు తెరువు.

దాని మాటకి శ్రీనివాసరెడ్డి ముసి ముసిగా నవ్వు తుంటే సింహాచలం కూడా నవ్వుతూ "పెట్ట కూతకి వచ్చింది దొరా" అంటూ అందర్ని వరసన అదిలిస్తూ పలకరిస్తూ తోటంతా తిరుగుతున్నాడు.

ఆడపిల్లలంతా వాళ్ళకి కేటాయించిన వాళ్ళ చిన్న కత్తిరతో పూలు కత్తిరించి బుట్టలో నింపుతున్నారు. అలా నింపిన పూలు తడి చాపల మీద గుమ్మరించి మళ్ళీ బుట్ట నింపడంలో నిమగ్నం అవుతున్నారు.

ఎంత జాగ్రత్తగా కత్తిరించినా రేకులు తునుగుతాయి. అలా తునిగిన రేకుల్ని వేరే బుట్టల్లోకి ఎత్తుతారు.

ఆ పూల బుట్టలన్నీ ఐస్ పొడి నింపిన చెక్కపెట్టెల్లో పెట్టి లారీలకి ఎత్తుతారు.

సూర్యుడు బాగా వెచ్చపడక ముందే ఆ లారీలన్నీ పట్నం పూల మార్కెట్ యార్డ్ చేరతాయి.

చిన్న చితక దుకాణాల వాళ్ళు కాక హోల్ సేల్ పూల వ్యాపారాలు, అత్తరు సాహెబులు చేరతారు. తోట దగ్గరే సగం వ్యాపారం అయిపోతుంది. మిగతా సగం, లారీ ఆగిన గంటలో పూర్తి అవుతుంది.

ఆ తోటలో పూలు తెంపుతున్న కన్నెపిల్లలందరూ కలలు కనే వయసులో వున్నవారే. వాళ్ళకి గంపెడు కోరికలున్నాయి. పూలు తెంపినందుకు దిన భత్యంతో పాట దోసెడు గులాబీలు చేతిలో పెడతాడు సింహాచలం.

మురిసిపోతూ ఆ గుంపులోని కొంతమంది ఆడ పిల్లలు తమ చింపిరి జుత్తులోనే ఆ పూలు కుక్కు కుంటారు.

కాని కొంతమంది పూట గడవని నిర్భాగ్యులు ఆ పూలని భద్రంగా ఆకులో చుట్టి బాపన వీధికి తీసు కెడతారు. క్షణంలో పూలు పదిపైసల చొప్పున అమ్ముడై పోతాయి. ఆ బాపన బస్తీ వాళ్ళకి పూజలు ఎక్కువ. శుక్రవారం, మంగళవారం అయితే గులాబీ ధర

పావలా పలుకుతుంది.

"నీ రుప్పతలలోకి ఆ పూలెందుకే. చనాల్లో రేకులన్ని రాలగొడతావ్. అమ్మితే ఓ రూపాయి డబ్బు లొత్తాయి. ఓ పూటకి నూకలొత్తాయి." అంటుంది మాలచ్మి తల్లి గౌరమ్మ

ఇంతలో "అన్నయ్యా.. అన్నయ్యా..." అన్న పిలుపుకి మాలచ్మి పూలు తెంపడం ఆపి తల తిప్పింది.

బరబరబర శబ్దం చేస్తూ వచ్చిన ట్రాక్టరులోంచి సువర్ణ ఛెంగున దూకి బోరింగ్ పంపు గట్టున కూర్చున్న అన్న శ్రీనివాసరెడ్డి ఒళ్ళో వాలింది గారంగా.

పెద్ద జరీ అంచు పట్టు పరికిణి, బుట్ట జాకీట్టు, మెళ్ళో ముత్యాల నెక్లెసు, చేతులకి ఒంకి గాజులు చెవికి బుట్ట లోలక్కులు.

అన్నీ కూడా మాలచ్మిని చూపు తిప్పకుండా చేసినవి. బంగారు కుప్పెలతో బారుగా అల్లకున్న జడ ఆ జడనిండా రంగురంగుల గులాబీలు... గులాబీల పూల జడ, జడపైన అరచేతి మందాన నాగరం తెల్లగా దంతపు బొమ్మలా మెరిసి పోతూ ఛెంగున దూకి అన్న వళ్లో వాలింది. ఆమెతో పాటూ ట్రాక్టరు దిగిన పాలెగాడు వెండి మరచెంబులో కాచిన వేడి పాలు, ఇంకో స్టీలు డబ్బాలో వేడివేడి ఇడ్లీ సాంబారు తెచ్చి గట్టు మీద పెట్టాడు.

శ్రీనివాస రెడ్డి ప్రేమగా చెల్లెలు బుగ్గలు పుణికి ముద్దు చేస్తూ" ఏంటమ్మా చెప్పు..." అన్నాడు. నల్గురు అన్నదమ్ములు మధ్య అపూరూపం...గా పుట్టిన శ్రీమంతుల ఇంటి ఆడపడుచు సువర్ణ.

"నాకు సాయంత్రం.... అవ్వ కొప్పెలు పెట్టి రెండు జడలు వేసి పూల జడకుడు తున్నది. నాకు అన్నీ పసుపు రంగుఎరుపు రంగు గులాబీలే కావాలి...." గారాలు గునిసింది సువర్ణ.

శ్రీనివాసరెడ్డి పకపక నవ్వాడు.

"ఓస్... అంతేకదా? నీక్కావలసినన్ని బుట్ట నిండా ఏరుకో" అన్నాడు.

అన్న ఆ మాట అనడం ఆలస్యం ఛెంగున గెంతి తడి చాపల మీద పోసిన గులాబీలని ఏరటం మొదలెట్టింది సువర్ణ. పూలు తెంపుతున్న మాలక్ష్మి సువర్ణ ఒకే రోజు పుట్టారు కాని ఎంత తేడా?

అసలు మాలక్ష్మి సువర్ణతో తనని పోల్చుకోకపోను. కాని మాలచ్మి తల్లి గౌరమ్మ అస్తమానం ..." ఆ రెడ్డిగారి బిడ్డ సువన్నది నీది ఒకటే వయసు నీది నాకు రెడ్డి గారి పెండ్లానికి వొకటే రోజు నొప్పులు మొదలయ్యాయి. రెడ్డిగోరుపట్నం నుంచి కారులో డాక్టరమ్మని పిలిపించారు. మనూరి మంతర సాని గూడా ఆడికే బోయింది. నాకు కడుపులో బిడ్డ అడ్డం తిరిగి శానా కట్టం అయ్యింది. అట్టనే తన్నకుని తన్నకుని నిన్ను గన్నాను." అని.

"అంతే మరి. ఆమెగోరు మారాణి, నేను పేదదాన్ని కట్టం అయినా సుంకం అయిన ఒకటే ఎట్టా అవుద్ది?"

సువర్ణని చూసినప్పుడల్లా మాలచ్మికి ఈ మాటలు జ్ఞాపకం వస్తాయి. నాలుగు దినాలకి ఒక సారి అయినా తలకి నూనె రాసుకుని జుట్టు దువ్వుకునే స్తోమత లేని తను, వాళ్ళ తోటలో కూలికి పూలు తెంచుతున్న తను, నిలువెల్లా బంగారు తొడుగుతో సువాసన నూనెలురాసుకుని రెండుపూట్లా గులాబీపూల జడలు వేసుకునేసువర్ణా ఒకటెలా అవుతారా? ఒకే రోజు పుట్టినంత మాత్రాన తల రాతలు ఒకటే అవుతాయా?

మాలచ్మి విచారంగా పెదవులు చప్పరించింది.

ఆ అమ్మాయిని చూస్తుంటే గొప్ప అనుభూతిగా ఉంటుంది మాలచ్మికి.

సువర్ణ జడలో ఒక్క రోజాపువ్వు పెట్టుకున్నాసినిమా బొమ్మలా అందంగా ఉంటుంది. కాని తాను పదిపూలు పెట్టుకున్నా అలా వుండదు. ఆ అమ్మాయి ఒళ్ళుముత్యంలా మెరిసి పోతూ ఉంటుంది. తన ఒళ్ళు మట్టి పట్టి



ఉంటుంది.ఆలోచిస్తే మాలచ్మికి గొప్ప దిగులు.

జీవితంలో ఒక్కసారి... తనూ ఒక్కసారి.. అలా పట్టు పరికిణి కట్టుకుని జడనిండా గులాబీలు ... పసుపురంగు గులాబీలు ... కుట్టుకోవాలి.

ఆ మాటే తల్లితో అంటే "నీ పెళ్ళికి పూల జడ ఏత్తాలే. ఏళ్ళ తరబడి రెడ్డి గారి తోటలో పూలు కోస్తుండావే ఆ మాత్రం నీ పెళ్ళి నాటికి అడిగితే బుట్టెడు పూలు ఇయ్యడా ఏంటి?" అంది.

తన పెళ్ళి... పూలజడ!

తన కెట్టాంటి పెనిమిటి వత్తాడో. సీనివాసరెడ్డి అంత అందంగా షోగ్గా వుంటే...?

మాలచ్మి పెదవులు ముసి ముసి నవ్వుల దొంతరలా విచ్చుకున్నాయి.

"ఏందే? పనిమాని దిక్కులు సూత్తుండావే..." చెళ్ళు మన్న ఛరుపుతో పాటు కయ్యి మన్న అరుపుకి వులిక్కి పడుతూ భుజం మీద బెత్తం దెబ్బ పడ్డ చోట చిరచిర మండుతుంటే మాలచ్మి ఆలోచన్లు కట్టిపెట్టి చకచకా పూలుతెంపటంలో నిమగ్నం అయ్యింది.

* * *

మాలచ్మికి పదిహేనేళ్ళు వస్తున్నాయి.

పెళ్లిచెయ్యాలని తొందర పడుతోంది గౌరమ్మ. మాలచ్మికి తండ్రి లేదు. అందుకని ఆ భారం పినతండ్రి భూపయ్య తన భుజాల మీద వేసుకున్నాడు.

మాలచ్మికి ఊళ్ళోనే ఓ సంబంధం ఉంది. చాలా కాలంగా వాళ్ళు అడుగుతున్నారు. వరసకి మేనరికం అత్త కొడుకు అవుతాడు శివుడు.

కాని శివుడ్ని చేసుకోవటం ససేమిరా ఇష్టం లేదు మాలచ్మికి.

"మోటబావిలోనన్నా దూకుతానుగాని ఆడ్ని మాత్రం సేసుకోను. బలవంతాన ఆడ్ని కట్ట బెట్టినా వంటే తెల్లారి ఎండ్రిన్ తాగుతా" అని నిక్కచ్చిగా తల్లికి చెప్పేసింది మాలచ్మి

అసలు ఆ సంబంధం గౌరమ్మకీ ఇష్టం లేదు.

శివుడి తండ్రి చాలాసార్లు వచ్చి అడిగిపోయాడు. పేదరికం వల్ల మగదిక్కు లేక "పోనీ చేస్తేనేం?" అని అప్పుడప్పుడు గౌరమ్మ ఆలోచించింది గాని శివుడ్నిఅల్లుడిగా చేసుకోవాలని ఆమె మనసు ఒప్పుకోలేదు. చిలక లాంటి చిన్నదాని గొంతు కొయ్యటమే అనిపించింది.

శివుడి అంగవైకల్యం మనసుకి ముల్లులా అని పిస్తుంది. శివుడికి పదేళ్ళ వయసులో మోటబాయి దగ్గర పని చేస్తుంటే పెద్ద కరెంటు షాక్ కొట్టింది. ఒక కాలు చెయ్యి వంకర పోయి స్థిమితం తప్పిన వాడిలా అయ్యాడు. నోటిమాట ముద్దగా అయ్యింది. ఇప్పుడు వాడి వయసు ఇరవై. ఎకరం పొలం, మేకలు, పాడి గెడె, వుండటానికి ఇల్లు ఉన్నాయి. ఒక్కడే కొడుకు. పిల్ల సుఖపడుతుంది. తిండికి లోటుండదు. కాని... గౌరమ్మ మనసు భరించలేదు. అంతకంటే ముందు ఆడితో పెళ్ళంటే మాలచ్మి ఉరి పెట్టుకుంటుంది. "కుంటి కులాసా-ఎర్రి ఎంగళాలు" అంటూ ఊళ్ళో పిల్ల లంతా ఆ శివుడ్ని ఏడిపిస్తారు.

"ఎందుకులే ఒదినా వేరే ఆ మాత్తరం మాలచ్మికి మొగుడు దొరక్క పోతాడా?" అన్నాడు మరిది.

నాలుగైదు సంబంధాలు చూసిన మీదట చివరికి ఒక సంబంధం ఖాయం అయ్యింది. "ఒదినా! పెళ్ళి కొడుకు పట్నంలో లారీ డ్రైవరు. ఇరవై నాలుగేళ్ళు. సినిమా హీరోలా వున్నాడు నాకు. ఎత్తుగా... ఎర్రగా... శానా బాగున్నాడు లే. పేరు ఎంకటేష్. తల్లి లేదంట... ఆడి చిన్నతనంలోనే సచ్చి పోనాదంట. తండ్రి ఊళ్ళు

పట్టి పోనాడు. అవ్వ పెంచింది. బాగా ముసిల్ది. సంపాదనకి లోటు లేదు. అడివిల్లోకి పోయి టింబరు ఏసు కొచ్చినప్పుడు పైగా బాగా మిగుల్తుందట. పట్నంలో ఇల్లుంది. కట్నం గిట్నం అవసరం లేదు. పిల్ల సక్కదనం ముఖ్యం అన్నాడు,'' అంటూ భూపయ్య తల్లితో చెపుతుంటే మాలచ్చికి ఆనందం వేసింది.

"కూలి పన్లకి పొనక్కర లేదు. పెద్దింటి ఆడపిల్లలా ఇంటి పట్టునే వుండచ్చు.'' అని కూడా అన్నాడు.ఇంకేం మరిది తండ్రి తరవాత తండ్రి లాంటి ఓడివి. అది నీకు మాత్తరం బిడ్డ కాదా. నీకు నచ్చితే కాయంసెయ్యి.'' అంది గౌరమ్మ.

పెళ్ళి చూపుల్లో మాలచ్చికి వెంకటేష్ బొల్డంత నచ్చాడు. శ్రీనివాసరెడ్డంత నచ్చాడు. ఆయన గొప్పోడు ఈడు పేదోడు అంతే అనుకుంది.

శ్రీనివాసరెడ్డి స్థానంలో వెంకటేష్‌ని ఊహించుకుంటే గొప్ప ఆనందం వేసింది.

* * *

పెళ్ళికి ముహర్తం పెట్టారు.

గౌరమ్మ షావుకారు దగ్గర వేసిన చిట్టి డబ్బులు తెచ్చింది. చెప్పుకో దగ్గ చుట్టం పక్క ఊళ్ళోనే వున్నారు. పొరుగూరున వున్న ఒకరిద్దరికీ కబురు అందింది.ఊళ్లో పెద్దల్ని అడిగి పచ్చికొబ్బరాకులు తెప్పించి గుడిసెముందు పందిరి వేసి అలికి ముగ్గులు పెట్టింది.

చిట్టి డబ్బుల్తో ఊళ్ళో బట్టల వ్యాపారం చేసే లింగరాజు దగ్గర పెద్దాపురం అంబా సిల్కు చీర, బుట్ట చేతుల జాకెట్టు కుట్టించింది. ఉదయాన్నే మాలచ్చి స్వయంగా తోటకి వెళ్లి ఆరోజు తన పెళ్ళని, పూలజడకి కావాలని అడిగింది.

శ్రీనివాస రెడ్డి నవ్వి "నీక్కావలసినన్ని కోసుకో'' అంటూ జేబులోంచి యాభైరూపాయలు నోటు తీసి ఏవన్నా కొనుక్కోమని ఇచ్చాడు.

ఒడినిండా రంగు రంగుల గులాబీలు నింపుకొని తెచ్చుకుంది. రేత్తిరి ఎనిమిదింటికి లగ్గం. అయినా మనసుండ బట్టక పొద్దున్నే పిన్ని చేత గులాబీపూలతో జడంతా కుట్టించుకుంది.

పెద్ద దండ గుచ్చి తల్లో పైన గుండ్రంగా పెట్టించుకుని జారకుండా పిన్నులు పెట్టింది. సంతలో కొని తెచ్చుకున్న గిల్టుబుట్ట లోలకులుపాపిడికి అటు ఇటు చంద్రవంక, సూర్యుడు, పూల జడ మీద నాగరం అమర్చుకుంది. కాళ్ళకి పారాణి పెట్టుకుని చేతుల నిండా పూల గాజులు వేసుకుంది. షావుకారు కొట్లో కొన్న పౌడరు పూసుకుని మెరిసే చెమ్కి బొట్టు పెట్టుకుంది పగిలిన అద్దంలో ముఖం రెండుగా కనిపిస్తుంటే పక్కింటి పారిజాతాన్ని అడిగి పెద్ద అద్దం తెచ్చుకుని ముఖం చూసుకుంది మాలచ్చి.

సువర్ణా రెడ్డితో సరితూగినట్లు అనిపించలేదు.

కాని గొప్ప ఆనందం వేసింది.

ఒకటికి రెండుసార్లు గులాబీపూలజడ భుజం మీద మెడచుట్టూ వేసుకుని చూసుకుంది.

పదింటికి పెళ్ళి కూతుర్ని చేశారు మాలచ్చిని.

గూడెపోళ్ళంతా మాలచ్చి పూలజడని తెగ మెచ్చు కున్నారు.

రాత్రికి లగ్గం. ఇప్పుడో ఇంకో గడియకో లారీలో వెంకటేష్ అతని స్నేహితులు బంధువులు వస్తారు.

వాళ్ళు వచ్చాకనే భోయినాలు.

అంత వాళ్ళ కోసమే ఎదురు చూస్తున్నారు.

సంపాదన పరుడు అందగాడు అయిన మొగుడు దొరికినందున మాలచ్చిని బంధుగులు, సావస గత్తెలు తెగ పొగుడుతున్నారు. "బొయ్యి'' మని ఏ శబ్దంవచ్చినా లారీ వచ్చిందని ఖంగారుపడుతున్నారు. వీళ్ళంతా ఎదురు చూసినట్టు....

లారీ అయితే రాలేదు గాని.... పట్నం నుంచివచ్చిన బస్సు దిగి - గౌరమ్మకి వరసకి మావ అయ్యే రాజయ్య మాత్రం వురుకులు పరుగులు పెడుతూ పెళ్ళి ఇంట్లోకి వచ్చి ముఖం అంతా ఎర్రగా చేసుకుంటూ "గౌరమ్మో! ఓ పాలి ఇటురా అమ్మో'' అంటూ చాటుకి తీసుకెళ్ళాడు.

ఏం జరిగిందో తెలియదు "ఓ లమ్మి.. నా కూతురూ'' అంటు గొల్లుమంది గౌరమ్మ.

"ఏమాయె ఏమాయె రాజన్నా''. అంటూ పెళ్ళి పెద్దలంతా చుట్టుముట్టారు.

పెళ్ళి కొడుకు వెంకటేష్‌కి అంతకు ముందే పెళ్ళి అయ్యిందిట. ఒక కొడుకుటపెళ్లాం మళ్లీ నీళ్లోసు కుందంట.

ఇద్దరికి ఎందుకో సరిగా పడటం లేదుట. ఆ విషయం దాచి పెట్టి మళ్ళీ రెండో పెళ్ళికి సిద్ధపడ్డాడుట వెంకటేష్‌కి సంపాదన బాగానే ఉందిట. కాని వ్యసనాలు ఉన్నాయిట. ఈ విషయం పట్నంలోని లారీ డ్రైవర్లే స్వయంగా చెప్పారట. రాజయ్య కూడా లారీ ఓనర్ల దగ్గర గోడౌన్స్‌లో పని చేస్తాడు. అందుకే విషయం తెలిసి చెప్పటానికి వచ్చానన్నాడు.

"మాలచ్చి పసి మొగ్గ. అలాంటి వాడ్ని చేసుకుని ఏం సుఖపడుతుంది? సవితి పోరు భరించుకోగలదా? అన్నెం పున్నెం ఎరగనిది.''

అంతే! క్షణంలో పెళ్ళి పందిరి అల్లకల్లోలం అయ్యింది.

"మరి! ఈ పెళ్ళి ఆగిపోతే దాని బతుకేం గాను. చిట్టి పాడిన డబ్బంతా ఇట్టా కరుసు అయిపోతే నే మళ్ళీ పెళ్ళి చెయ్యగలనా?''

గొల్లుమంది గౌరమ్మ.

"అత్తా! ఏడవమాకే. మాలచ్చిని నే సేసుకుంటా...''

కుంటు కుంటూ వచ్చిన శివుడు అమాయకంగా గౌరమ్మ కన్నీరు తుడిచాడు.

చుట్టూ మూగిన పెళ్ళి పెద్దలు నివ్వెర పోయారు.

ఆ క్షణంలో శివుడు ఆపద్భాంధవుడిలా కనిపిం చాడు. "ఏదో పెమాదంలో ఆడి కాలు చెయ్యి ఒంకరయి కాస్త వాత తప్పింది. లేకుంటే శివుడు మారాజు కదూ. వాడి కష్టం వాడు చేసుకుంటున్నాడు.

వాడి పొలం వాడు దున్నుకుంటున్నాడు. ఏదో చూపుల గుర్రం గాని నా కొడుకు కంటె ఆస్తి పాస్తులు ఎక్కువా ఆ ఎంకటేసుకి'' అన్నాడు కల్పించుకుంటూ శివుడి తండ్రి రుద్రయ్య. మొదట్నించి మాలచ్చి ని నా కొడుక్కి చేసుకుంటా ననే అంటాన్న'' అని కూడా జ్ఞాపకం చేశాడు.

రుద్రయ్య మాటల్ని గౌరమ్మ మరిది సమ్మతించారు.

చుట్టూ మూగిన పెద్దలు సమర్థించారు.

"మరి ... ఆ ఎంకటేష్ వత్తే గొడవయితుందేమో'' అంది గుబులుగా గౌరమ్మ.

"గొడవ వత్తే ఊరుకుంటాం ఏంటి? ఆడి బండారం బయట పెట్టి ఊరి పొలిమేరల దాకా తరిమి కొట్టమా? పోలీసోళ్ళకు సెప్పమా? మన గూడెం మొగోళ్ళు గాజులు తొడిగించుకు లేరు.'' అన్నాడు రంగయ్య.

"ఈ రుద్రయ్యంటే సవటకాదు, పేరుకి తగ్గోడు'' అన్నాడు రుద్రయ్య మీసం తిప్పుతూ.

ఏ వంటావే మాలచ్చి'' అంది గౌరమ్మ కూతురు తల నిమురుతూ. మాలచ్చి 'ఊ' అన లేదు 'ఆ' అనలేదు.

శ్రీనివాసరెడ్డిని చూసిన కళ్ళతో వెంకటేష్‌ని చూస్తేనే మనసు మూల్గింది.

సువర్ణా రెడ్డితో తన్ని పోల్చుకున్నప్పుడు మనసు మూలిగింది.

కాని వెంకటేష్‌ని చూసిన కళ్ళతో శివుడ్ని చూస్తే కడుపంతా వికారంగా అయ్యింది.

"చిన్న పిల్ల దానికేం తెలుసు. లెగండి. శివుడ్ని పెండ్లి కొడుకుని చెయ్యండి. ఇప్పుడు పన్నెండుకి కూడా మంచి లగ్గమేఉంది. ఆ ఎంకటేషుగాడు రాకుం డానే శుభ కార్యం జరిపించేద్దాం.'' అన్నాడు రాజయ్య పెద్దరికం వహిస్తూ.

అంతే!

క్షణంలో తలంటి కొత్త బట్టలు తొడిగి పెళ్ళి కొడుకుని చేసి శివుడ్ని పీటల మీద కూర్చోపెట్టారు.

పొద్దున్న అనగా కట్టుకున్న గులాబీలు నలిగాయి.

ఇంకా బుట్టలో పూలున్నాయి. కానీ మళ్ళీ జడ కుట్టుకుందామన్నా సమయం లేదు. ఇష్టం లేదు మాలక్ష్మికి. అలాగే వెళ్ళి పెళ్ళి పీటల మీద కూర్చుంది.

మంగలి ముసలయ్య సన్నాయి వాయించాడు.

"కుంటి కులాసా

ఎర్రి ఎంగళాయ్

తింగరి పణాస్...'' ఎవర్ని అయితే వెక్కిరించి ఆట పట్టించిందో.. ఆ ఎర్రి ఎంగళాయ్ ముందు తలదించి మూడు ముళ్ళు వేయించుకుంది మాలక్ష్మి.

పూర్తిగా విచ్చుకొని పసి మొగ్గని తెంపినప్పుడు సింహచలం ఎలా కేక పెట్టాడో మాలచ్చి మనసు అలాగే కేక పెట్టింది.

కంట్లోంచి నీళ్ళు మాత్రం రాలేదు.

కాని....

డబ్బాశ చూపించి, రాజయ్య చేత లోపాయి కారీ తనం చేయించి వెంకటేష్ ఊళ్ళోకి దిగకుండా లారీ ఓనరు చేత చెప్పించిన సంగతి, అతడికి అప్పటికే పెళ్ళి అయ్యిందని అల్లిన కట్టు కథ అలస్యంగానైనా సరే గౌరమ్మకి తెలియనివ్వకూడదు.. అనుకుంటూ కొడుకు వైవాహిక జీవితం వెయ్యేళ్ళు చల్లగా వుండాలని మనసారా దీవిస్తూ వధూవరుల మీద అక్షింతలు జల్లాడు రుద్రయ్య.

"ఒక పెళ్ళి చెడగొట్టినా ఇంకో పెళ్ళి చేస్తున్నానుగనక నాకు పాపం అంటూ లేదు'' అనుకుంటూ అక్షింతలు జల్లాడు రాజయ్య.

❐